క్లుప్తంగా

ఎన్‌సీసీలో 55 మంది విద్యార్థుల చేరిక



తెనాలిఅర్బన్: 22వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో మారీసుపేటలోని నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపికను నిర్వహించారు. 8,9 తరగతి చదువుతున్న 55 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు పఠాన్ కరిముల్లా తెలిపారు. కార్యక్రమంలో సుబేదార్ రాకేష్‌కుమార్, హవల్దార్ చరణ్, హవల్దార్ రమస్ ఠాగూర్, గరల్స్ క్యాడెట్ ఇన్‌స్ట్రక్టర్ నవ్య, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం అంగలకుదురు స్వధార్ హోమ్ సమీపంలో సుమారు 45 నుండి 55 సంవత్సరాల వయసున్న వ్యక్తి ఈనెల 17న సాయంత్రం ఫిట్స్ తో రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్ సహకారంతో తెనాలి గవర్నమెంట్ హాస్పటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ 18న మృతి చెందాడు. అంగలకుదురు వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్ సమస్యలను పరిష్కరించండి



తెనాలిఅర్బన్: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయు నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. తెనాలి ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయం ముందు కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమాను వర్తింప చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకుడు షేక్ హుస్సేన్‌వలీ, ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు సురేష్, దిలీప్‌కుమార్, చక్రి, గోపికృష్ణ, ప్రశాంత్, ప్రదీప్; సునీల్, సతీష్; శ్రీధర్, ఎం.కృష్ణ, కరిముల్లా, ఈశ్వర రావు, కిరణ్‌కుమార్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కౌలుదారులకు బ్యాంక్ రుణాలు

అమర్తలూరు(వేమూరు): గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందని బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ సహాయకులు, ఉద్యాన వన సహాయకులు, విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల డీలర్లతో శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఏఓ ఎం.హేమంత్ భరత్ కుమార్ అధ్యక్షత వహించారు. ధనరాజ్ మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో కౌలు రైతులందరకీ కార్డులు త్వరగా ఇప్పించాలన్నారు. పంట నమోదు ప్రక్రియ ప్రారంభం కాబోతుందని, పంట నమోదు పక్రియకు సిద్ధం కావాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి బి.మణికంఠ, డి.మాధవి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బాలికలకు శక్తి యాప్‌పై అవగాహన



బాలికలకు అవగాహన కల్పిస్తున్న నగరం ఎస్ఐ భార్గవ్

భట్టిప్రోలు: బాలికలు ఏదైన ప్రమాదంలో ఉన్నప్పుడు సెల్‌ఫోన్‌లో కేవలం ఒక బటన్ నొక్కడం ద్వారా తక్షణమే పోలీస్ సహాయం పొందవచ్చునని నగరం ఎస్ఐ భార్గవ్ తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ గూర్చి శనివారం భట్టిప్రోలు విశ్వశాంతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బాలికలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ భార్గవ్ మాట్లాడుతూ యాప్ వినియోగదారులు జీపీఎస్ స్థానాన్ని గుర్తించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం పంపాలని పేర్కొన్నారు. బాధితులు వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. శక్తి యాప్‌ను ప్రతి విద్యార్థి ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ప్రిన్సిపాల్ ఫణి పార్థసారథి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అంతులేని కాలుష్యం

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక
- పట్టణంలో పలుచోట్ల స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



మానవహారంలో పాల్గొన్న చైర్‌పర్సన్ రాధిక, ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ వాడకం వల్ల అంతులేని కాలుష్యం పెరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆవేదన వ్యక్తం చేశారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు నిషేధించాలని సూచించారు. దీనిని వాడటం వలన అనేక దుష్ఫలితాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం మానవ మనుగడకే ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రజలందరూ ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు. మార్కెట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్డు, గాంధీచౌక్ మీదుగా బోసురోడ్డు, చిట్టిఆంజనేయస్వామి దేవస్థానం వరకు సాగింది. ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించి ప్లాస్టిక్ ఉపయోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ప్రజల నుంచి తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌ను సేకరించారు.

- స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని 15వ వార్డులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వార్డులోని ప్లాస్టిక్ వస్తువులను సేకరించారు. అలాగే ప్లాస్టిక్‌ను ఉపయోగించమనే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ మహాలక్ష్మి, హవీలా, ఆర్‌పీలు కల్యాణి, పరిమళ, తదితరులు పాల్గొన్నారు.



మలేరియా కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు



వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్‌నాథ్

- స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పాత ప్రభుత్వ వైద్యశాలలోని సహాయ మలేరియా అధికారి కార్యాలయంలో నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే దుష్పరిణామాలను మండల సబ్ యూనిట్ అధికారి వంగాల పున్నారెడ్డి వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, జి.రవికుమార్, అందె బాలచంద్రమౌళి, దీపాల శ్రీనివాసరావు, దాసరి మల్లేశ్వరరావు, తిరువీధుల శివరామ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.
- స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జెఎంజె కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఆవరణను ఊడ్చి శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజ్ లీనా, డాక్టర్ దాసరి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ సిబ్బంది సేకరించిన ప్లాస్టిక్ వస్తువులు

- స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహించారు. ఆవరణ శుభ్రం చేసి పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.
- ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ ఎస్.రమేష్‌నాథ్ పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని తెనాలి జిల్లా వైద్యశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణలో ప్రతి వ్యక్తి వలంటీర్‌గా మారాలని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి.వి.రంగారావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, వైద్యశాల ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రామాంజనరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు రైతులకు న్యాయం జరిగింది



గుంటూరు వెస్ట్: గత ఏడాది జనవరిలో దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా దారుణంగా నష్టపోయిన పసుపు రైతులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేసిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ప్రమాదంలో 294 మంది రైతులు, 14 మంది ట్రేడర్‌లకు చెందిన 1.23 లక్షల పసుపు బ్యాగులు బూడిదయ్యాయన్నారు. దీని విలువ రూ. 45 కోట్లు అని తెలిపారు. అయితే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల చొరవ, అధికారుల కృషితో సుమారు రూ. 36 కోట్లకు పైగా క్లయిమ్‌లు తెప్పించగలిగామన్నారు. ఈ మొత్తం బీమా పరిహారంలో రూ. 20 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళ్లగా, రూ. 4.75 కోట్లు ట్రేడర్లకు, మరో రూ. 10 కోట్లు శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యానికి విడుదలయ్యాయన్నారు. ఈసందర్భంగా మంత్రి పెమ్మసాని, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా రైతులకు నమూనా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, డీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో ధృవతారలు.. ఆలూరి బైరాగి, శారద

నేడు స్వస్థలమైన తెనాలిలో శతజయంతి సదస్సు సందర్భంగా...



శారద | ఆలూరి బైరాగి

తెనాలి: తెలుగు సాహితీలోకంలో తమ రచనలు, కవిత్వంతో ప్రత్యేక స్థానం నిలుపుకున్న రచయితలు శారద (ఎస్.నటరాజన్), కవి ఆలూరి బైరాగి. ఈ ఉద్దండ రచయితల శతజయంతి సదస్సు ఆదివారం వారి స్వస్థలమైన తెనాలిలో జరగనుంది. సాహిత్య అకాడమీ, స్వాతంత్ర్యయోధుడు వడ్లమూడి గోపాల కృష్ణయ్య, వడ్లమూడి వెంకటలక్ష్మమ్మ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో స్థానిక కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆలూరి బైరాగి, శారద శతజయంతి సదస్సును ఉదయం 10 గంటల్నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు సాహితీ యోధుల పరిచయం. తెలుగు కథకుల్లో ఒక మెరుపులా అతి స్వల్పకాలంలోనే ఉప్పెనలా విరుచుకుని వచ్చిన శారద, ఎందరినో విభ్రాంతులను చేశాడు. అసలు పేరు ఎస్.నటరాజన్. కవి, కథకుడు, నవలా రచయిత, నాటక రచయిత, వ్యాస రచయిత, లిఖిత పత్రికా సంపాదకుడు. 12-13 ఏళ్ల వయసులో బతుకుదెరువు కోసం తండ్రితో కలిసి తెనాలి చేరిన నటరాజన్, హోటల్ కార్మికుడిగా చేరాడు.

ఆ వృత్తిలో వుంటూనే తెలుగు నేర్చాడు. నాటి తెలంగాణ పోరాటం, ఆర్థికమాంద్యం, సామాజిక సంక్షోభాలు, కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలతో ఆయన సాహిత్య సృజన వేయిరేకులై వికసించింది. హోటల్‌లో వంటమాస్టరుగా, కళాయితో బజ్జీలు వేయటం, బస్టాండులో నెత్తిమీద కుండతో మజ్జిగ విక్రయించినా, ఏమాత్రం ఖాళీ దొరికినా పుస్తకాలు చదవటమే, రాయటమో చేస్తూ వచ్చాడు. భౌతిక జీవితం 30 ఏళ్లయితే సాహిత్య జీవితం ఏడేళ్లు మాత్రమే. ఆ వ్యవధిలోనే శారద కలంపేరుతో నూరుకు పైగా కథలు, ఆరేడు నవలలూ రాశారు.

- సమస్త జీవితం గాయాలమయమై ఎన్నెన్నో నిరాదరణలకూ, హేళనలకూ గురవుతూ ఎన్నో వత్తిళ్లలోంచి, దుఃఖంలోంచి జీవిత పోరాటమే సాహిత్యంగా, సాహిత్యమే జీవితంగా పలవరించాడు శారద. తెలుగువాడు కాకున్నా అతడు తన రచనల్లో అంత గొప్పగా తెలుగుతనాన్ని పంచటం ఆశ్చర్యకరం. పేదవర్గాలు, దిగువ మధ్య తరగతుల జీవితాల్లోని వాస్తవికతను, వ్యథలను గొప్పగా చిత్రించాడు. ఆ రచనల్లో చిత్రించిన తెలుగు జీవితం, తీసుకువచ్చిన తెలుగు వాతావరణం, తెనాలి, విజయవాడ, గుడివాడ వంటి కథాస్థలాలను అతడు ప్రస్తావించిన తీరు, కథలోని వాస్తవికతకు ఎంతో దోహదపడ్డాయి. అందుచేతనే శారద 1955లోనే కన్నుమూసినా, ఇప్పటికీ తన రచనలతో చిరంజీవిగానే ఉండిపోయారు.
- ప్రపంచానుభూతితో తన స్వీయానుభూతిని మేళవించి ఆధునిక తెలుగు కవిత్వంలో తనదైన ముద్రతో ద్వితీయ సహస్రాబ్ది మహాకవి అనిపించుకున్నారు ఆలూరి బైరాగి. తెనాలి అయితానగర్‌లో 1925 సెప్టెంబరు 5న జన్మించారు. జాతీయాభిమానంతో బైరాగికి హిందీ అక్షరాభ్యాసం చేయించారు. హిందీ పాఠశాలలో మధ్యమ చదివాడు. గురువు ప్రజనందనశర్మ వద్ద రాష్ట్ర భాష, విశారద పూర్తిచేశాడు. 13వ ఏట ముజఫర్‌పూర్‌కు వెళ్లి నాలుగేళ్లు హిందీ, సంస్కృతం నేర్చుకున్నారు. 1941లో తిరిగొచ్చాడు. రాడికల్ డెమొక్రాటిక్ పార్టీ నాయకులతో పరిచయాలు బైరాగి జీవితంలో కీలక మలుపునకు దారితీసింది. మార్క్సిస్టు తత్వశాస్త్రం, ఎంఎన్ రాయ్ సిద్ధాంతాలు బైరాగిని ఒక విలక్షణమైన దార్శనికునిగా తీర్చిదిద్దాయి.
- ఇరవై ఏళ్లకే తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, బెంగాలీ భాషల్లో పాండిత్యాన్ని సాధించాడు బైరాగి. 1946లో హిందీ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం జీవితంలోకి ప్రవేశించాడు. 'చీకటి నీడలు' కవితా సంకలనం వెలువరించాడు. సినీనిర్మాత, తన పినతండ్రి చక్రపాణి సూచనపై చెన్నైలో హిందీ 'చందమామ' సంపాదకుడిగా చేరారు. పాఠకులకు కమ్మని నీతికథలను గేయరూపంలో అందించాడు. హిందీ కవితా సంకలనం 'పలాయన్' తెచ్చాడు. స్వేచ్ఛాప్రియుడైన బైరాగి, ఆ పత్రిక నుంచి కొద్ది కాలానికే బయటకొచ్చాడు. తన కవితా ప్రస్థానంలో ముఖ్యమైన 'నూతిలో గొంతుకలు'తో మానవ సహజ వేదనకు గాఢమైన అభివ్యక్తిని ఇచ్చాడు. 'దివ్యభవనం' కథాసంపుటిని తీసుకొచ్చాడు. మహాజలపాతం వంటి పదగుంభనం, అనన్యమైన భావోద్వేగం, అనితరసాధ్యమైన ధారాశుద్ధి కలిగిన బైరాగి, ఎప్పుడూ సమూహంలో ఒంటరిగానే ఉండేవాడు.
- అతడి కవితల్లోని నిరాశను చూసి విరాగి అనేవారు. అయినా బైరాగి జీవితంలో తలమునకలు కాలేదు. ప్రవాహంలో పడి కొట్టుకుపోలేదు. జీవితాన్ని వివిధ కోణాల్లో చూశాడు. సమాజంలోని పీడిత, తాడిత ప్రజల బాధామయ జీవిత గాథలను తన కవిత్వపు ప్రతి పంక్తిలోనూ జీవింపజేశాడు. తనకంటూ ప్రత్యేకంగా నిర్మించుకున్న సాహితీ జగత్తులోనే నివసించాడు. సమాజంలోని లోటుపాట్లను, సామాన్యుల జీవితాల్లోని ఒడిదుడుకులను, పీడితుల పాట్లను చూసి హృదయం ద్రవించి, ఆ వేదననే కవిత్వంగా చెప్పారు. అందుకే ఆయన కవిత్వమంతటా చీకటి, తుఫాన్, విధ్వంసం, నెత్తురు అలుముకున్నాయి.

బైరాగి వెలువరించిన గ్రంథాలు తక్కువే అయినా, అవే ఆయన్ను తెలుగు, హిందీ సాహిత్యంలో ధృవతారగా నిలిపాయి. ఆయన రాసిన 'ఆగమగీతి' కావ్యానికి రాష్ట్ర సాహిత్య అకాడమీ, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డులు లభించాయి. బైరాగి జీవితాన్ని చాలా నిరాడంబరంగా గడిపారు. అవసరాలను తగ్గించుకున్నాడు. రచనలతో వచ్చే ఆదాయంతోనే కాలక్షేపం చేశాడు. అతడి ముగ్గురు సోదరులు ఎదిగి వచ్చి, బైరాగికోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడినా, ఒంటరిగానే జీవించాడు. ఆరోగ్యం క్షీణించినా ఆహార నియమాలు పాటించలేదు. 1978 సెప్టెంబరు 9న మరణించాడు.

తెనాలిని ప్రథమస్థానానికి తీసుకు రావాలి

- రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- 307 మంది కార్మికులకు రూ.5లక్షల ప్రమాద బీమా
- సొంత నిధులతో ఏర్పాటు



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రక్కన చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని నిలిపాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలపై ఉందని, ఆ దిశగా అందరూ అడుగులు వేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. తెనాలి పుర పాలక సంఘ పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య విభా గ ఉద్యోగులు, కార్మికులతో శనివారం సాయంత్రం కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పురపాలక సంఘంలో పారిశుద్ధ్య నిర్వహణ చాలా దారుణంగా ఉందని, వచ్చే ఏడాదిలోపు మార్పు తీసుకోరావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అందరూ సమిష్టిగా పనిచేస్తే మంచి ఫలితాలు లభిస్తాయని సూచించారు. గతంలో తడి,పొడి చెత్త సేకరణలో జాతీయస్థాయిలో తెనాలి అనేక అవా ర్డులు అందుకుందని గుర్తు చేశారు. ఆ పరిస్థితిని తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నా రు. నూరు శాతం చెత్త సేకరణ జరిగే విధంగా చూడటంతో పాటు మురుగు కాల్వల్లోపూర్తి స్థాయిలో సిల్ట్‌ను తొలగించాలని సూచించారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కొబ్బరి బొండాల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. తెనాలి పట్టణంలో ఉన్న 307 మంది కార్మికులకు రూ.5 లక్షలు విలువ చేసే ప్రమాద బీమాను తన సొంత నిధులతో అక్టోబర్ 1 నాటికి ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వార్డుల్లో పర్యటిస్తున్న సమయంలో వాటిపై శ్రద్ధ చూపుతున్నారని, తరువాత వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, నగర దీపికల అభిప్రాయాలను సేకరించారు. నగర దీపికలకు నూతన యూనిఫాంను పంపిణీ చేశారు. సమావేశానికి ఇన్‌చార్జి కమిషనర్ వీఎం. లక్ష్మీపతిరావు అధ్యక్షత వహించగా, ఎంఈ శ్రీకాంత్, ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు, ఎసీపీ శివన్నారాయణ, పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలు పూడ్చారు!





సాక్షి ఎఫెక్ట్

తెనాలి: 'గుంతలున్నాయి...జాగ్రత్త' శీర్షికన గుంటూరు-హనుమాన్‌పాలెం రహదారిలో కొల్లిపర మండలంలోని చివలూరు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలపై 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఆర్‌అండ్‌బీ అధికారులు అక్కడి అంబేడ్కర్ విగ్రహం, చర్చి వద్ద ఏర్పడిన భారీ గుంతలతోపాటు దగ్గర్లోని చెరువు వరకు దాదాపు 400 మీటర్ల వరకు రోడ్డుపై డస్ట్ పోసి పొక్లయిన్‌తో సరిచేశారు. తాత్కాలిక మరమ్మతులతో ప్రమాదాలను నివారించారు. ప్రస్తుతం వర్షా కాలం అయినందున, హెవీ వాహనాల ట్రాఫిక్ ఉండే ఆ రోడ్డుపై వర్షాలు కురిస్తే మళ్లీ కొద్దిరోజుల్లోనే పరిస్థితి మొదటికొచ్చే అవకాశం ఉంటుంది. అందుచేత అక్కడ తారు లేదా సిమెంటుతో శాశ్వత మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వల్లభాపురంలో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

కొల్లిపర: వివాహిత ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన వల్లభాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది దీనిపై ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని వల్లభాపురం గ్రామానికి చెందిన నన్నేబోయిన సురేష్ భార్య జ్యోతి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. సురేష్ గ్రామంలో కొంత మందికి డబ్బులు అప్పుగా ఇచ్చి తిరిగి వారి వద్ద నుంచి వసూలు చేయడం లేదు. అలాగే కొంతమంది వ్యక్తులకు తన భర్త బ్యాంకులో ష్యూరిటీగా ఉండటం వలన బ్యాంకు వారు వారికి రుణం ఇవ్వలేక పోతున్నామని చెప్పటంతో మనస్థాపానికి గురై ఉరివేసుకొని చనిపోయినట్లు భర్త సురేష్ ఫిర్యాదు చేశాడు. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్మికుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వం



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

తాడేపల్లి రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎంటీఎంసీ రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు ఎం.రవి అన్నారు. శనివారం ఎర్రబాలెంలో ఇంజినీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె ఏడో రోజుకు, మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రభు త్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల స్పందించి సమ్మె పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.బాబు, ఒ.రామారావు, ఆదిలక్ష్మి, కోటేశ్వరి, పార్వతి, కరీముల్లా, శివకోటి, చిన్న, శ్రీను, మేరి పాల్గొన్నారు.



బిక్షాటన చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల భిక్షాటన..

తాడేపల్లిలోని మున్సిపల్ కార్మికులు శనివారం సమ్మె సందర్భంగా బిక్షాటన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్యారీ కంపెనీ గేటు, బోసుబొమ్మ సెంటర్ మీదుగా సీఐటీయూ కార్యాలయం వరకూ దారి పొడవునా జోలి పట్టి సాయం అందించాలని అభ్యర్థిచారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఫెడరేన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావులు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, పల్లె కృష్ణ, వేణు, డేవిడ్, ఝాన్సీ, సంతోషం, వెంగమ్మ, కామాక్షి, రాంబాబు, నాయకులు వెంకటరెడ్డి, డి.శ్రీనివాస కుమారి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై సమగ్ర ఆరోగ్య ప్రచారం



వేమూరు: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-2 పరిధిలో హెచ్‌ఐవీపై సమగ్ర ఆరోగ్య ప్రచారం నిర్వహణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ కార్యక్రమం గ్రామంలో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ పేరమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ నాగశ్రీ, జ్యోత్స్న, ఏఎన్ఎం పిచ్చిమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జ్ఞాన శక్తితోనే యోగాకు మార్గం

తాడేపల్లి రూరల్: మంగళగిరి శ్రీ మార్కండేయ పద్మశాలీ కల్యాణ మండపంలో స్థానిక మాస్టర్ సీవీవీ యోగా ప్రభా సెంటర్ ఆధ్వర్యంలో శ్రీ కొత్త రామకోటయ్యతాత ఆశీస్సులతో రెండు రోజుల పాటు జరిగే మెర్రీ లైఫ్ డే గురుపూజ మహోత్సవం, బ్రహ్మశ్రీ వేలూరి ప్రభాకర్ శాస్త్రి 136వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని మాస్టర్ సీవీవీ యోగా గురువులు, ప్రతినిధులు హాజరై ప్రవచనాలు అందజేశారు. విజయవాడ మాస్టర్ సీవీవీ యోగా ప్రభాస్ సెంటర్ గురువులు పోతురాజు యోగానందం ప్రవచనం చేశారు. మానవ జన్మ గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల మాస్టర్ సీవీవీ యోగ క్షేత్రాల ప్రతినిధులు శ్యామల, సీతారాం, శివానందం, కొంగతి సుబ్బారావు, విష్ణుమూర్తి, స్థానిక యోగ ప్రభా సెంటర్ ప్రతినిధులు దామర్ల హనుమంతరావు, పణిదపు రమేష్, దామర్ల వీర ప్రసాద్, కుంభకోణ రామమూర్తి, సంగమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



యోగా విశిష్టతను వివరిస్తున్న యోగానందం

పోలింగ్ బూత్‌లపై సమావేశం



వేమూరు: పోలింగ్ బూత్‌లపై అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎం.నాగిరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 1200 కన్నా ఎక్కువగా ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. వేమూరు నియోజక వర్గంలోని కొల్లూరు మండలంలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో 1200 కన్నా ఎక్కువగా ఓట్లు ఉన్నాయని, ఆ ప్రాంతాల్లో కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రం పరిధిలోని కొత్త ఓట్లు నమోదు, మరణాలు తొలగించడం, చేర్పులు, తొలగింపు కార్యక్రమాల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. తహశీల్దార్ కె.సుశీల, వెంకటేశ్వర్లు, నెహ్రూబాబు, శ్రీనివాసరావు, నాగరాజరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.